క్లుప్తంగా

మత్స్యకారుల పడవల లైసెన్స్‌లపై 29న అవగాహన సదస్సు


జిల్లా మత్స్యశాఖాధికారి నిర్మలకుమారి

కొవ్వూరు: గోదావరి నదిలో చేపలు పట్టే మత్స్యకారులకు చెందిన చెక్క పడవలు, తెప్పలు, ఫైబర్ బోట్లు కలిగిన వారికి ఫిషింగ్ లైసెన్స్‌లపై అవగాహన కార్యక్రమం ఈ నెల 29వ తేదీన కొవ్వూరులో నిర్వహించనున్నట్టు జిల్లా మత్స్యశాఖాధికారి(జాయింట్ డైరెక్టర్) టి.నిర్మల కుమారి తెలిపారు. పట్టణంలో పంచాయతన శివాలయం వద్ద ఉన్న వీఐపీ ఘాట్ వద్ద మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. సమన్వయ శాఖలతో కలిసి ఈ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,09,574 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ఏర్పాటు

ఉండ్రాజవరం: మండల మానవత నెలవారీ సమావేశం అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు అధ్యక్షతన పాలంగి గ్రామంలోని మానవత భవనంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో కడలి మాణిక్యాలరావు అధ్యక్షతన మానవత 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పలపాటి శ్రీనివాసు, సెక్రటరీగా ఐసెట్టి విజయరాజు, ట్రెజరర్‌గా మట్టపర్తి భవనకుమార్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం మానవత జిల్లా డైరీని ఆవిష్కరించారు. ముందుగా మండల మానవత సంస్థకు పాలంగి గ్రామానికి చెందిన నెక్కంటి సుధాకర్, నామాల శివరామ కృష్ణ విరాళాలను అందించారు. వీరి ఇరువురిని మానవత సంస్థ తరుపున సత్కరించారు.

మజ్జిగ పంపిణీ


ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

నిడదవోలు : పట్టణంలో గణేష్ చౌక్ సెంటర్‌లో ఉన్న పూజ గణపతి కుమార స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మజ్జిగకు పంపిణీ చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, తోలేటి కోటేశ్వరరావు, ముప్పనబోయిన గంగారావు, దుళ్ళ మురళి తదితరులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ చూపిన కావేరికి సత్కారం


కావేరిని సత్కరిస్తున్న మానవతా సభ్యులు

నిడదవోలు : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థిని ఎ. కావేరి అత్యధిక మార్కులు(579) సాధించడంతో ఆదివారం నిడదవోలు మానవత సభ్యులు అభినందించారు. ఈ మేరకు విద్యార్థిని కావేరిని సత్కరించి ప్రోత్సాహక బహుమతి కింద రూ.3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు దారపురెడ్డి సూర్యచంద్రరావు, యండమూరి నాగేంద్ర, హెచ్‌ఎం వి.లక్ష్మి, కొప్పుల వెంకటేశ్వరరావు, కుందుల ప్రభాకరం, పెనుగొండ వెంకటేశ్వరరావు, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరస్వామికి అభిషేకం

ఉండ్రాజవరం: గ్రామంలో స్వయంభూగా వెలసిన బాలా త్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం రాత్రి ప్రదోషకాలంలో మహా నందేశ్వరస్వామికి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు మద్దిరాల వెంకట రమణ మాట్లాడుతూ అమావాస్య ముందు వచ్చే చతుర్దశి రోజున నందీశ్వరునికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తే గ్రహ దోషాలు పోయి ఆరోగ్యం చేకూరి, మనశ్శాంతి లభిస్తుందని అర్చకులు తెలిపారు. భక్తులకు స్వామివారిని దర్శించుకున్నారు.

కల్యాణం వైభోగమే

- నియోజకవర్గంలో శుభకార్యాల సందడి
- మే వరకు మంచి ముహూర్తాలు
- పూల మండపాలకు పెరిగిన గిరాకీ
- పల్లెల్లో వెలసిన ఏసీ కల్యాణ మండపాలకు డిమాండ్
- పెరిగిన వివాహ ఖర్చు


తాళ్లపూడిలో వివాహానికి సిద్ధం చేసిన పచ్చి పూల మండపం

తాళ్లపూడి: పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు, తప్పెట్లు, తాళాలు తలంబ్రాలూ.. మూడే ముళ్లు, ఏడే అడుగులు మొత్తం కలిసి నూరేళ్లు అన్నాడు ఓ సినీ కవి. అయితే మారిన కొత్త ట్రెండ్‌కు అనుగుణంగా ఇప్పుడు జంటలు ఒక్కటవుతున్నాయి. ప్రీవెడ్డింగ్ షూట్, హల్దీ, మెహందీ, సంగీత్ వంటి కల్చర్‌ను అనుసరిస్తూ వివాహాలు చేసుకుంటున్నారు. కానీ పురాతన ఆచార సంప్రదాయాలు నేటికీ పాటిస్తున్నారు. వేదమంత్రాలు, మేళతాళాలు, మంగల్యధారణ ఇలా వివాహం అనేది ప్రతి ఒక్కరి జీవితంలోను మరుపురాని పండుగగా మారుతోంది. వివాహాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకొంటున్నారు. ఈ కల్యాణ వైభోగానికి అధికంగానే ఖర్చు చేస్తున్నారు.

ప్రస్తుతం అన్ని రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు చోటుచేసుకున్నట్లు గానే వివాహ వేడుకల్లోను పలు మార్పులు చోటుచేసుకున్నాయి. డ్రోన్ ఫొటోగ్రఫీ, ప్రీ వెడ్డింగ్, పోస్టు వెడ్డింగ్ షూట్‌లు, ఏసీ ఫంక్షన్ హాళ్లు, విద్యుత్ సెట్టింగ్‌లు, భారీ డెకరేషన్లు, రిసెప్షన్లు, హంగు ఆర్భాటం ఇలా మార్పులు వచ్చాయి.

రెండు నెలలు మంచి ముహూర్తాలు

చైత్ర, వైశాఖ మాసంలో 20 వరకూ పెద్ద ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. పెళ్లిళ్లతోపాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు కూడా ఊపందుకున్నాయి. రెండు నెలలపాటు ఏప్రిల్, మేలలో చైత్ర, వైశాఖ మాసాల్లో పెళ్లిళ్ల సందడి కనిపించనుంది. మే 18వ తేదీ వరకు మంచి ముహూర్తాలున్నాయి. ఏప్రిల్‌లో 25, 29, 30, మేలో 1, 5, 6, 8,15, 17, 18, 22, 24, 27, 28 వరకు మంచి ముహూర్తాల్లో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి.

జోరుగా వ్యాపారాలు

పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారాలు కూడా జోరుగా సాగుతాయి. బట్టలు, బంగారం, ఇతర వస్తువులు కొనుగోలు ఎక్కువగానే ఉంటుంది. ఏసీ ఫంక్షన్ హాల్, బ్యాండ్ పార్టీలు, పురోహితులు, కేటరింగ్, ఫొటోగ్రాఫర్లు, టెంట్, లైటింగ్, డెకరేషన్, ఈవెంట్ ఆర్గనైజర్లు ఇలా అందరి చేతి నిండా పని దొరుకుతుంది. ప్రస్తుతం ఎవరు కూడా ఖర్చుకు వెనకాడడం లేదు.

పెరిగిన ఖర్చు

ఇటీవల వివాహంలో ఏసీ కల్యాణ మండపాలపై ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారు. అన్ని ఒకే చోట దొరకడంతో ఇంటి వద్ద ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. హోదా కూడా చాటుకోవచ్చు అనే భావన కూడా కలుగుతుంది. మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు, రకరకాల సెట్టింగ్‌లు, పచ్చిపూల మండపాలు, బెలూన్, వివిధ రకాల క్లాత్ డెకరేషన్‌లతో అంగరంగ వైభవంగా వివాహ తంతును వేడుకగా మార్చేసుకుంటున్నారు. గతంలో పట్టణాలకే పరిమితమైన ఈ హంగులు నేడు పల్లెలకు చేరాయి. ఏసీ కల్యాణ మంపడం అయితే అన్ని ఖర్చులు కలిసి రూ.80 వేల నుంచి సుమారు రూ.రెండు లక్షలు వసూలు చేస్తున్నారు. ఇక ఇటీవల నిశ్చియ తాంబూలాల నుంచి చిన్నచిన్న ఫంక్షన్‌లకు సైతం పచ్చిపూల మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఉన్నత వర్గాల వారి ఫంక్షన్‌లు, వివాహాలకు అయితే ఏ మాత్రం ఖర్చుకు వెనుకాడడం లేదు. వారి హోదాను, స్థాయిని ప్రదర్శించే మంచి అవకాశంగా భావిస్తుంటారు. ఫలానా వారి వివాహం చూడడానికి రెండు కళ్లు చాల లేదురా బాబు అన్నట్టు నిర్వహిస్తున్నారు. ఇటీవల పచ్చిపూల మండపాలకు భలే డిమాండ్ పెరిగింది. అభిరుచినిబట్టి వీటిని సిద్ధం చేస్తున్నారు. ఒక్క వివాహానికి లైటింగ్, క్లాత్ సెట్టింగ్‌కు రూ.25 వేలు నుంచి రూ.లక్షకు పైగా ఖర్చవుతుంది. అదే విధంగా పచ్చిపూల మండపానికి అయితే రూ.25 వేల నుంచి రూ.1.70 లక్షలకు పైగా వెచ్చిస్తున్నారు. అదే విధంగా ఫ్లెక్సీలు, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు, మ్యూజికల్ నైట్, స్కిట్లు, ఈవెంట్స్‌కు అదనంగా వెచ్చిస్తున్నారు. అంతే కాకుండా బాణసంచా వెలుగులు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆర్థిక స్తోమతను బట్టి ప్రతి ఒక్కరూ ఉన్నంతలో భారీగా వివాహాలు చేసేందుకే మొగ్గు చూపుతున్నారు.


తాళ్లపూడిలో పూలతో డెకరేషన్ చేసిన రిసెప్షన్ మండపం (ఫైల్)

అంతా క్యాటరింగ్ సంప్రదాయం

ఇక చివరగా వివాహానికి వచ్చిన బంధువులకు విందు భోజనం. స్థాయిని బట్టి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల కేటరింగ్ సంప్రదాయం బాగా పెరిగింది. బంధువుల స్థానంలో క్యాటరింగ్ వారు భోజనాలు వండి వడ్డించే బాధ్యతను తీసుకుంటున్నారు. గతంలో ఇంటి వద్ద తయారు చేసి భోజనాలు వడ్డించేవారు. తీరిక లేకపోవడం ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న తరుణంలో కేటరింగ్ అందరికీ సులభ మార్గమైపోయింది. మెను చెబితే చాలు టిఫిన్ దగ్గర నుంచి భోజనం వరకు అన్ని వారే చూసుకుంటున్నారు. ఇంట్లో జరిగే అన్ని వేడుకలకు క్యాటరింగ్ పైనే ఆధారపడుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


నూతన కమిటీల్లో పదవులు పొందిన నాయకులను సత్కరిస్తున్న నేతలు

చాగల్లు: రాబోయే రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ అన్నారు. ఆదివారం చాగల్లులో సురేంద్రకుమార్ నివాసంలో వైఎస్సార్ సీపీ నూతన కమిటీల్లో పదవులు పొందిన వారిని పలువురు అభినందించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షులు మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జాలెం వెంకట్రావులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, సుంకర సత్యనారాయణ, గేదా శ్యామ్, బొర్రా కృష్ణ, గండ్రోతు సూర్యనారాయణ, ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, పిండి మంగరాజు, దాసరి కృష్ణ, సూర్యం, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

చాగల్లు: వైఎస్సార్ సీపీ చాగల్లు మండల సమావేశం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు తెలిపారు. చాగల్లులో శ్రీ కృష్ణదేవరాయ కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి మండలంలో ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు. పార్టీ రానున్న రోజుల్లో తీసుకోబోయే భవిష్యత్ కార్యాచరణపై కొవ్వూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో సమీక్షించనున్నట్టు ఆయన తెలిపారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

నల్లజర్ల: వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా, సెల్‌ఫోన్లు, టీవీలతో కాలం గడపకుండా పుస్తక పఠనం చేసేలా విద్యార్థుల భవితకు బాటలు వేస్తూ సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్టు నల్లజర్ల శాఖా గ్రంథాలయ పాలకురాలు ఏవీ రమణ తెలిపారు. ఈ శిక్షణ తరగతులు జూన్ 6వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. విద్యార్థులకు కథలు వినిపించడం, పుస్తక పఠనం, సమీక్షలు, చిత్రలేఖనం, నృత్యం, సంగీతం, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ ఆర్ట్ తదితర సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు.శిక్షణ అనంతరం నేర్చుకున్న అంశాలపై పరీక్షలు, పోటీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందిస్తారన్నారు.

గ్రంథాలయాల్లో 28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

కొవ్వూరు: వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 28వ తేదీ నుంచి జూన్ ఆరో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి జీవీవీఎస్ త్రినాథ్ తెలిపారు. ఈ శిబిరం ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగుతుందన్నారు. సెలవుల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న బాల, బాలికలకు వేసవిలో విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

మమ్మేలమ్మా.. గంగానమ్మా..


ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్తున్న మహిళలు


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: గంటావారిగూడెం గ్రామ దేవత గంగానమ్మతల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 20న జాతర ప్రారంభం కాగ మే 4వ తేదీ వరకు జాతర జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు ఇమ్మణ్ణి రాంబాబు తెలిపారు. ఆదివారం అమ్మవారికి మంగళస్నానాలు చేయించే కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామంలోని ఆడపడుచులు, మహిళలు ప్రత్యేక వస్త్ర ధారణతో గటాలను శిరస్సుపై ఉంచి చల్లంగా చూడాలంటూ నినాదాలతో మేళతాళాలతో ఊరంతా ఊరేగి అమ్మవారికి మంగళ స్నానాలు చేయించి, నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, నాయకులు బంక అప్పారావు, ఈలప్రోలు చంద్రరావు, తొమ్మండ్రు ఆదిత్య, సత్తిపండు, వై.వాసు, జువ్వలపాలెపు అన్నవరం, తోట వెంకట్రావు, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పీతల సుజాత, గంటాపద్మశ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు.

పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరికీ గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు

కొవ్వూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కొవ్వూరు మండల, పట్టణ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో చురుగ్గా సమర్థవంతంగా పని చేసే వారికి గ్రామ కమిటీ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. మండల, జిల్లా, గ్రామ స్థాయి కమిటీల్లోను, అనుబంధ కమిటీల నియమాకంలోను పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న నాయకులకు అవకాశం కల్పిస్తామని ప్రకటించామన్నారు. పది నెలలకే కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, ఈ సమయంలో ప్రజలకు అండగా ఉండాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న రోజుల్లో తిరిగి వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయం అన్నారు. ప్రజా సమస్యలపై గ్రామ స్థాయి నాయకులు దృష్టి సారించాలని సూచించారు. మండలంలో గ్రామాల వారీగా కమిటీల ఏర్పాటుపై నాయకులతో సమీక్షించారు. పట్టణంలో వార్డుల వారీగా కమిటీల ఏర్పాటుపై నాయకులను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు వెంపాటి సురేష్ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నగ్గళపాటి శ్రీనివాస్, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, పరిమి సోమరాజు, ఏలూరి విజయలక్ష్మి, బోడసింగి తులసి, అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, గోలి శ్రీనివాస్, బత్తి నాగరాజు, మాసా ఆనంద్, కవల నాగేశ్వరరావు, మాసా ఆనంద్, పాకా మోహన్ రావు, మెరిపో వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పదవులు పొందినవారికి సత్కారం


మండల కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షుడు, యాక్టివిటీ కార్యదర్శులను సత్కరిస్తున్న తోట తదితరులు

తాళ్లపూడి: ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా, మండల కమిటీల్లో కీలక పదవులు పొందిన మండలానికి చెందిన నాయకులను పెద్దేవంలో ఆదివారం పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయన ఇంట వద్ద ఘనంగా సత్కరించారు. తాళ్లపూడి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావును, తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంటేశ్వరరావును, పార్టీ జిల్లా యాక్టివ్ కార్యదర్శి వంబోలు పోసిబాబులను పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాషం, నాయకులు పోశిన శ్రీకృష్ణదేవరాయులు, మద్దుకూరి దొరబాబు,చింతా వెంకట స్వామి, నల్లాకుల వేణుగోపాల కృష్ణ, కోడి గంగారవు, చేమకూరి సత్యనారాయణ, బట్టు సుబ్బారావు, నూతంగి సురేష్, యండపల్లి లక్ష్మన్, సత్యనారాయణ, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నల్లజర్ల: పుల్లలపాడు వద్ద బైపాస్‌పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. దేవరపల్లి గ్రామానికి చెందిన దాసుదుర్గాప్రసాద్, అంజి, మరో వ్యక్తి కలసి ఆదివారం తెల్లవారుజామున కాలినడకన ద్వారకా తిరుమల వెళ్తుండుగా మార్గంమధ్యలో రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో దుర్గా ప్రసాద్‌కు తీవ్రగాయాలు కాగ మిగతా ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వారిని కాకినాడ తరలించగా మిగతా ఇద్దరు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా యాళ్ల రామారావు


యాళ్ల రామారావు


కుచ్చులపాటి కుమార్

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన యాళ్ల రామారావు నియమితులయ్యారు. ఆయన నిడదవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా 15 ఏళ్లు పని చేశారు. తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయ డైరెక్టర్‌గా, శంకరాపురం సొసైటీ అధ్యక్షుడిగా విశిష్ట సేవలందించారు. వైఎస్సార్ సీపీ పార్టీలో 2019 ఎన్నికల్లో జి.శ్రీనివాస్‌నాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందడంలో కీలకంగా వ్యవహరించారు. జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా ఎన్నికైన రామారావును మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ నాయకులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా స్పోక్‌పర్సన్‌గా కుచ్చులపాటి

వైఎస్సార్ సీపీ జిల్లా స్పోక్‌పర్సన్‌గా సమిశ్రగూడెం గ్రామానికి చెందిన కుచ్చులపాటి కుమార్ నియమితులయ్యారు. 20 ఏళ్లపాటు ఎయిర్‌పోర్స్‌లో ఉద్యోగం చేసిన కుమార్ వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ సమిశ్రగూడెం ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, పార్టీ నాయకులు నాగప్రసాద్, అంబేద్కర్, రహీం, అంగర శ్రీను తదితరులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో గుండాట

కొవ్వూరు: పెనకనమెట్ట గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గుండాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.ఆదివారం సెలవు దినం కావడంతో పాఠశాలను అసాంఘిక కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారని, నిందుతుల నుంచి రూ.1,940 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలను పార్టీ కండువాలు వేస్తున్న జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు

గోపాలపురం: మండలంలో గోపవరం, నందిగూడెం గ్రామాల నుంచి సుమారు 10 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం రాత్రిన గోపాలపురం కేఎస్ రెడ్డి ఫంక్షన్ హాలులో నిర్వహించిన మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, మాజీ హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాలు పార్టీలోకి వచ్చే కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కుక్కా నరసింహారావు, వాసుబోయిన గోపాలకృష్ణ, పూలపల్లి సుబ్బారావు, కడిమి బన్నీ, జాలపర్తి శ్యామ్‌సుందర్, పూలపల్లి గణేష్, కొంత మంది కార్యకర్తలకు కండువాలు వేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, సాలి వేణు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై దివ్యాంగుల నిరసన

నిడదవోలు: జమ్మూ కశ్మీర్‌లో పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని గణపతి జంక్షన్‌లో జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడి మృతులకు సంతాపం వ్యక్తం చేశారు. జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ర్యాలీ శివ, సీపీఎం నాయకులు రాంబాబు, కృప, బాలాజీ, లక్ష్మణరావు, రమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గోపాలపురం జెడ్పీ హైస్కూల్‌లో 1999-2000 పూర్వ విద్యార్థులు

గోపాలపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఇప్పటికీ 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు వారి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో చేసిన అల్లరి పనులు, చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. విద్యార్థులంతా కలసి పాఠశాలలో చదువుకొనే విద్యార్థులకు అనువుగా ఉండే మూడు లక్షల రూపాయల వ్యయంతో షెడ్డు నిర్మించారు. వీరికి చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను గుర్తించి సుమారు 20 మందిని సత్కరించి మెమెంటోలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఉపాధ్యాయులతో మున్సిపల్ హైస్కూల్ 2005-06 బ్యాచ్ విద్యార్థులు

నిడదవోలు: పట్టణంలో మున్సిపల్ హైస్కూల్-3 2005-06 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. 20 ఏళ్లకు కలుసుకున్న వారంతా ఒకరికొకరు అప్యాయంగా పలకరించూ సందడి చేశారు. గత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాధ్యాయులు సూర్యచంద్ర, శేష్ కుమార్, సోంరాజు, లక్ష్మి, బేగం టీచర్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మల్లపు నాగరాజు, షేక్ హబీబ్, ఉప్పులూరు రాధాకృష్ణ, మోర్త ప్రమోద్ కుమార్, షేక్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు)

90100 51493 (నిడదవోలు)

90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com